సాక్షి
తిరుపతి
గురువారం : 22 : జూన్ : 2023



శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు దర్శించుకునేందుకు 15 గంటలు పడుతోంది. - 8లో



ఆర్టీసీ బస్సును ఢీకొన్న టెంపో

చౌడేపల్లె- సోమల మార్గంలో బస్సును టెంపో ఢీకొన్న ప్రమాదంలో 22మంది గాయపడ్డారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	26
చిత్తూరు	34	26
తిరుమల	30	22
గూడూరు	37	28
నగరి	36	27

న్యూస్‌రీల్

తిరుమల ఘాట్‌లో వాహనాల తనిఖీ

తిరుమల : తిరుమలకు వెళ్లే మొదటి ఘాట్‌రోడ్డులో ట్రాఫిక్ పోలీసులు బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. శ్రీప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయానికి సమీపంలో ట్రాఫిక్ డీఎస్పీ కొండయ్య, బ్రేక్ ఇన్‌స్పెక్టర్, సిబ్బందితో కలిసి పలు వాహనాలను తనిఖీ చేశారు. వేగంగా వెళ్లే వాహనాలు, హెల్మెట్ లేకుండా వెళుతున్న ద్విచక్రవాహనదార్లను ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఘాట్‌లో నిర్దేశిత వేగంతోనే వాహనాలు నడపాలని, బైక్‌పై వెళ్లే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆదేశించారు. రికార్డులను పరిశీలించి, లైసెన్స్ లేని వారికి జరిమానా విధించారు.

పాఠశాలల్లో పక్కాగా వసతులు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ బాలాజీ

తిరుపతి అర్బన్ : ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 30వ తేదీలోపు పక్కాగా మౌలిక వసతులు కల్పించాలని జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో మన బడి నాడు-నేడు, జగనన్న విద్యా కానుక తదితర అంశాలపై డీఈఓ శేఖర్‌తో కలిసి విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ నాడు-నేడు పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. వివిధ దశల్లోని భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నాడు-నేడు రెండో విడతలో ఎంపికైన 886 పాఠశాలల్లో రూ.25.23 కోట్లతో మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. ఈ మేరకు ఎస్టిమేట్లను శుక్రవారం లోపు అందించాలని ఆదేశించారు. బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలో చేరేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జగనన్న విద్యా కానుక కిట్లను సకాలంలో అందించి బయోమెట్రిక్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఎస్ఏ ప్లానింగ్ కో-ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి సురేష్ పాల్గొన్నారు.

28న తలకోనలో దుకాణాల వేలం

భాకరాపేట : తలకోన శ్రీ సిద్ధేశ్వర స్వామి ఆలయం వద్ద శాశ్వతంగా దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు ఈ నెల 28వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ భూమిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, ఈఓ జయకుమార్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ 4 దుకాణాలకు నిర్వహించనున్న వేలంలో పాల్గొనేందుకు రూ.5వేల డిపాజిట్ చెల్లించాలని సూచించారు.

తలకోన సిద్ధేశ్వరాలయం బోర్డు చైర్మన్‌గా వేణుగోపాల్‌రెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న భూమిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి

భాకరాపేట : తలకోన శ్రీ సిద్ధేశ్వర స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా భూమిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. బుధవారం ఉదయం స్వామి వారిని దర్శించుకున్న తర్వాత ఆయనతో ఈఓ జయకుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ సిద్ధేశ్వర స్వామి ఆలయ గోపురాన్ని సొంత నిధులతో పూర్తి చేస్తామన్నారు. తనను పదవిలో నియమించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఎమ్మార్సీ రెడ్డి, ఆలయ బోర్డు మాజీ చైర్మన్ రెడ్డెప్పరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు కరుణాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నాగేశ్వరరావు, బోర్డు సభ్యులు నాగిరెడ్డి, జయంత్, రాజేశ్వరి, సురేష్, పార్టీ మండల కన్వీనర్ నాగార్జునరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు చందనారెడ్డి, సర్పంచ్‌లు మధుసూదన్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

ముక్కంటి హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపులో సిబ్బంది

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. స్వామివారికి కానుకల రూపంలో రూ.1.19 కోట్లు, 0.050 గ్రాముల బంగారం, 438 కేజీల వెండి, 72 నోట్ల విదేశీ కరెన్సీ వచ్చినట్లు ఈఓ సాగర్‌బాబు తెలిపారు. 20రోజుల్లోనే ఈ ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు.

● ఆరోగ్య 'యోగ'ం



తిరుపతి ప్రకాశం పార్క్‌లో యోగా సాధన చేస్తున్న మేయర్ శిరీష, కార్పొరేషన్ కమిషనర్ హరిత తదితరులు

జిల్లావ్యాప్తంగా బుధవారం 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు యోగా సాధన చేశారు. యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని శిక్షకులు వెల్లడించారు. శారీరక దృఢత్వంతోపాటు మానసికోల్లాసం కలుగుతుందని తెలిపారు. పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు యోగా ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రపంచ మానవాళికి భారతావని అందించిన మహోన్నత బహుమతి యోగా అని వివరించారు. అందుకే వసుధైక కుటుంబం పేరిట వేడుకగా యోగా దినోత్సవం జరుపుకుంటున్నట్లు పేర్కొన్నారు.

– సాక్షి, తిరుపతి



యోగా చేస్తున్న పద్మావతి వర్సిటీ వీసీ భారతి



ప్రకాశం పార్కులో విద్యార్థుల ఏకాగ్రత..



యోగాసనాలు వేస్తున్న పిల్లలు

మఠంలో అక్రమాలపై కొరడా

- మొన్న మఠాధిపతి.. నిన్న ఏఓ తొలగింపు
- హథీరాంజీ మఠంలో అవకతవకలపై చర్యలు

సాక్షి, తిరుపతి : తిరుపతి హథీరాంజీ మఠంలో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మొన్న మఠాధిపతి అర్జున్‌దాస్.. నిన్న ఏఓ వీపీ మిశ్రాపై వేటు వేసింది. ఇప్పటి వరకు జరిగిన అవకతవకలపై విచారణకు ప్రత్యేక అధికారిని నియమించింది. ఆయన లోతుగా విచారించి ఏఓ మిశ్రాను తొలగించారు. హథీరాంజీ మఠం ఆధీనంలో వేలకోట్ల రూపాయలు విలువ చేసే భూములు, ఆభరణాలు ఉన్న విషయం తెలిసిందే. తిరుపతి జిల్లాతో పాటు దేశ, విదేశాల్లో ఉన్న ఆస్తుల్ని సంరక్షించాల్సిన వారే స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. విలువైన ఆస్తుల కోసం మఠాధిపతి సహకారంతో.. ఏఓ మిశ్రా హథీరాంజీ మఠంలో తమ బంధువులను ఉద్యోగులుగా చేర్పించినట్లు తెలుస్తోంది. ముందుగా.. అర్జున్ దాస్ దూరపు బంధువని అంటూ పీఏ టూ మహంత్ పేరుతో డాక్టర్ వీపీ మిశ్రా మఠంలోకి తాత్కాలిక ఉద్యోగిగా చేరారు. తర్వాత దేవదాయశాఖ కమిషనర్ అనుమతి లేకుండానే హథీరాంజీ మఠానికి ఏఓగా (పరిపాలన అధికారిగా) నియమితులయ్యారు. డిప్యూటీ డైరెక్టర్ హోదాలో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, బెంగుళూరులో ఉద్యోగవిరమణ చేసిన మిశ్రా హథీరాంజీ మఠంలో కీలకంగా మారారు. మఠాధిపతి అర్జున్ దాసు అండదండలతో వేల కోట్ల రూపాయల విలువైన హథీరాంజీ మఠం ఆస్తుల్ని అన్యాక్రాంతం చేసేశారు.

సెక్యూరిటీ ఆత్మహత్యతో..

గతంలో హథీరాంజీ మఠం నుంచి బంగారం మిస్సయిన విషయం తెలిసిందే. ఈ కేసులో మఠం సెక్యూరిటీ అధికారిని అనుమానించటంతో ఆయన ఆత్మహత్య చేసుకోవడం విధితమే. ఆ ఘటనలో దేవదాయ శాఖ కమిషనర్ రెండేళ్ల క్రితం మిశ్రాను పదవి నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేసినా అర్జున్ దాస్ ఆ ఉత్తర్వులను పెడ చెవిన పెట్టారు. చివరకు మఠంలో అక్రమాలపై సీఐడీ అధికారులు అందించిన నివేదిక మేరకు అర్జున్‌దాస్‌ను మహంత్ పదవి నుంచి సస్పెండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకు మృతి



మృతి చెందిన కృష్ణయ్య



గురుచరణ్



గాయపడిన చరిష్మా

- ట్రాక్టర్‌ను వెనుకనుంచి ఢీకొన్న బైక్
- కుమార్తె వైద్యం కోసం వెళ్లి తిరిగిరాని లోకాలకు..

నారాయణవనం: స్థానిక బాలిక ఉన్నత పాఠశాల వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో తండ్రీకొడుకులు మృతి చెందారు. వివరాలు.. మండలంలోని వెలుతురుకండ్రిగకు చెందిన కృష్ణయ్య(40) జ్వరంతో బాధపడుతున్న కుమార్తె చరిష్మా(7)ను చికిత్స నిమిత్తం కుమారుడు గురుచరణ్(3)తో కలిసి బైక్‌పై పుత్తూరుకు తీసుకెళ్లాడు. తిరుగుప్రయాణంలో ఉండగా మామిడికాయల లోడ్‌తో ముందు వెళుతున్న ట్రాక్టర్ హఠాత్తుగా ఆగడంతో వెనుకనుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కృష్ణయ్య, గురుచరణ్, చరిష్మా తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కృష్ణయ్య, గురుచరణ్ మరణించారు. చరిష్మాను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను సీజ్ చేసి, డ్రైవర్ వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకున్నామన్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు బుధవారం అప్పగించినట్లు వెల్లడించారు.

కాణిపాకం ఆలయ అభివృద్ధిపై సమావేశం



కమిషనర్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ చైర్మన్, ఈఓ

కాణిపాకం(యాదమరి):కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ అభివృద్ధిపై విజయవాడలో బుధవారం దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణతో పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు సమావేశం అయ్యారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఆలయ అభివృద్ధి పనులపై కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేసి, అన్ని విధాలుగా సహకరిస్తామని తెలిపారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

విజయా డెయిరీ పరిశీలన



డెయిరీను పరిశీలిస్తున్న అమూల్ సంస్థ ప్రతినిధులు, అధికారులు

చిత్తూరు అగ్రికల్చర్: చిత్తూరు విజయా డెయిరీని బుధవారం అమూల్ సంస్థ ప్రతినిధులు, అధికారులు సందర్శించారు. డెయిరీని పునఃప్రారంభానికి త్వరలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమి పూజ చేయనున్నారు. ఈ క్రమంలో డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఫెడరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, కో ఆపరేటివ్ సొసైటీ కమిషనర్ అహ్మద్‌బాబుతో పాటు అమూల్ సంస్థ ఆపరేషన్ హెడ్ అమర్‌జిత్ సింగ్, ప్రాజెక్ట్ ఇన్‌చార్జి విక్రమ్ చౌడ, కలెక్టర్ సగిలి షన్మోహన్ డెయిరీని సందర్శించారు. డెయిరీ ఆవరణలో కలియతిరిగి వివిధ విభాగాలను, భవనాలను, యంత్రాలను భవిష్యత్తులో ఏమాత్రం ఉపయోగపడతాయన్నది నిశితంగా పరిశీలించారు. వీరివెంట జేసీ శ్రీనివాసులు, ట్రైనీ కలెక్టర్ వై.మేఘస్వరూప్, డీసీఏఓ వనజ, డీసీఓ బ్రహ్మానందరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ తులసి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ప్రభాకర్, చిత్తూరు ఆర్డీఓ రేణుక ఉన్నారు.

దళిత రైతులకు వెన్నుదన్ను

- పెత్తందార్ల చెర నుంచి పేదల భూములకు విముక్తి
- సాగుకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు
- క్షేత్రస్థాయిలో పర్యటించి భరోసా కల్పించిన అధికారులు



బాధితులతో మాట్లాడుతున్న ఆర్డీఓ



భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాసరావు

సాక్షి, తిరుపతి : పెత్తందారుల చెర నుంచి దళితుల భూములకు విముక్తి లభించనుంది. జీవనాధారం కోసం పంపిణీ చేసిన భూములను నిజమైన పేదలు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. మేతపోరంబోకు భూములను దర్జాగా ఆక్రమించుకున్న వారి వివరాలను రెవెన్యూ యంత్రాంగం సేకరిస్తోంది. వివరాలు.. వెంకటగిరి నియోజకవర్గం బాలాయపల్లి మండలం నిండలి గ్రామ పరిధిలోని నిరుపేదలైన 18 మంది దళితులకు 2004లో అప్పటి ప్రభుత్వం భూములు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ భూముల్లోకి దళితులను వెళ్లనివ్వకుండా స్థానిక పెత్తందారులు కొందరు అడ్డుకుంటూ వచ్చారు. ఈ విషయాన్ని సాక్షి పత్రిక వెలుగులోకి తీసుకొచ్చింది. 'మేతపోరంబోకులో.. టీడీపీ గద్దలు' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ బుధవారం బాలాయపల్లి మండలంలో పర్యటించారు. ప్రభుత్వం పంపిణీ చేసిన భూములను పరిశీలించారు. కొందరు పెద్దలు సృష్టించిన అడ్డంకులతో దళితులు ఆయా భూముల్లోకి ప్రవేశించలేకపోయిన విషయం గుర్తించారు. ముళ్ల చెట్లతో చిట్టడవిని తలపిస్తున్న భూములను చదును చేయించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆర్డీఓ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం నుంచి దళితులు పొందిన 12 ఎకరాలు సాగులోకి తీసుకువచ్చేందుకు పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఆయా భూములకు హద్దులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే దారి సౌకర్యం కల్పించేందుకు అవసరమైతే ప్రైవేటు భూములను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. సాగునీటి సరఫరాకు బోరు పాయింట్లు వేయించనున్నట్లు వివరించారు. ఎవరైనా మేత, అటవీ, చెరువు, కాలువ పోరంబోకు భూములను ఆక్రమించుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడెక్కడ ఆక్రమణలు ఉన్నాయో తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టినట్లు స్పష్టం చేశారు. త్వరలోనే ఆయా వివరాలను వెల్లడిస్తామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు. ఈ క్రమంలో బాధిత దళిత మహిళలు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన భూముల్లోకి మమ్మల్ని వెళ్లనివ్వకుండా ఇంతకాలం కొందరు పెత్తందార్లు అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాక్షి పత్రిక వాళ్లు మా కష్టాలను వెలుగులోకి తీసుకురావడంతో ఇన్నాళ్లకు న్యాయం జరుగుతోందని తెలిపారు. సాక్షి వారికి, అధికారులకు రుణపడి ఉంటామని హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి ఎఫెక్ట్..

కౌలు రైతుకు మేలు

తిరుపతి అర్బన్ : అన్నదాతలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండదండలందిస్తోంది. పెట్టుబడి సాయం నుంచి పంట ఉత్పత్తుల కొనుగోలు వరకు పూర్తి సహకారం అందిస్తోంది. ఈ క్రమంలోనే కౌలు రైతులకు సైతం మేలు చేకూర్చేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా కౌలు రైతులకు సీసీఆర్‌సీ (క్రాప్ కల్టివేషన్ రైట్స్ కార్డ్స్) పేరిట గుర్తింపు కార్డులను జారీ చేస్తోంది. గతంలో కౌలు కార్డులు పొందిన వారికి రెన్యూవల్ సైతం చేయిస్తోంది. ఈ కార్డు పొందిన కౌలు రైతులందరికీ సంక్షేమ ఫలాలను అందించేందుకు కార్యాచరణ అమలు చేస్తోంది. ఈ మేరకు అర్హులైన వారందరూ కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకునేలా వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కార్డు పొందిన రైతులకు పంట నమోదు, ధాన్యం కొనుగోలు, వైఎస్సార్ రైతు భరోసా, పంటకు నష్టం వాటిల్లితే పరిహారం, పంట బీమా వర్తిస్తుందని వివరిస్తున్నారు. సీసీఆర్‌సీ కార్డు పొందేందుకు యాజమాన్య రైతు పొలం పాసు పుస్తకం, ఆధార్, కౌలుదారు ఆధార్‌తోపాటు మూడు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలను దరఖాస్తుకు జతచేసి సంబంధిత ఆర్‌బీకేల్లో అందించాలని సూచిస్తున్నారు.

ఇప్పటి వరకు 7,067 మంది

జిల్లాలో ఇప్పటి వరకు 1,044 గ్రామాల్లోని 7,067 మంది కౌలు రైతులను సీసీఆర్‌సీ కార్డులకు అర్హులుగా ఎంపిక చేశారు. వారిలో 1,829 మందికి కార్డులు పంపిణీ చేశారు. మిగిలిన వారికి ఈ నెల 30వ తేదీలోపు అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. కౌలు కార్డులు పొందివారికి ఈ ఏడాది రూ.200 కోట్ల వరకు రుణాలు మంజూరు చేసేందుకు వ్యవసాయశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.



కౌలు రైతు గుర్తింపు కార్డు

ప్రతి పథకం అందిస్తాం



సొంత పొలంలో సాగు చేసుకునే రైతులతోపాటు కౌలుదారులకు సైతం ప్రతి పథకం అందించేందుకు చర్యలు చేపట్టాం. బ్యాంకు రుణాలను కూడా ఇప్పించేందుకు ప్రణాళిక రూపొందించాం. రైతు భరోసా కేంద్రాల ద్వారా సకల వసతులు సమకూర్చాలని నిర్ణయించాం. ప్రభుత్వం అందిస్తున్న సీసీఆర్‌సీ కార్డులను కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నాం.

– ఎస్.ప్రసాద్‌రావు,
జిల్లా వ్యవసాయశాఖాధికారి

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

సైదాపురం : మండలకేంద్రంలో యాకసిరి మల్లికార్జునరావు(49) అనే వ్యక్తి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. గ్రామంలోని బస్టాండ్ వద్ద మల్లికార్జునరావు ఓ షాపు నిర్వహిస్తున్నాడు. వ్యాపారం కోసం అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక మనస్తాపం చెంది ఉరేసుకున్నాడు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


అశోక్‌కుమార్ మృతదేహం

తడ:మండలంలోని మాంబట్టు వద్ద వాటర్ సర్వీసు దుకాణంలో అశోక్‌కుమార్(35) అనే వ్యక్తి బుధవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివరాలు.. సూళ్లూరుపేట మండలం అటకానితిప్పకు చెందిన అన్నదమ్ములు బాలసుందరం, అశోక్‌కుమార్ వాటర్ సర్వీస్ షాపు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అశోక్‌కుమార్ ఓ బైక్‌కు వాటర్ సర్వీస్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. అపస్మారకస్థితిలోకి వెళ్లడంతో స్థానికులు 108లో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలు కేసుల్లోని నిందితుడు అరెస్టు

చిత్తూరు అర్బన్: పలు కేసుల్లోని నిందితుడిని చిత్తూరు క్రైం పోలీసులు బుధవారం అరెస్టు చేసి ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్ జడ్జ్ ఎదుట హాజరు పరుచారు. వివరాలు ..విశాఖపట్నం జిల్లా దేవరపల్లె మండలం కేఎం పాలెం గ్రామానికి చెందిన ఆవులరాజు (45)పై పలు పోలీస్ స్టేషన్‌ల్లో కేసులు ఉన్నాయి. నిందితుడు 2014 నుంచి కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. చిత్తూరు క్రైమ్ ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు బృందంతో కలిసి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుడిని పట్టుకున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


మోహిత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు


పట్టు పురుగుల సాగును పరిశీలిస్తున్న మోహిత్‌రెడ్డి

- బడుగు బలహీన వర్గాలకు భరోసా
- మహాపాదయాత్రలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల : పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. బుధవారం లింగనపల్లె పంచాయతీ, కె.వడ్డేపల్లె పంచాయతీల్లో ఆయన గడప గడపకు మహాపాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. సంక్షేమ ఫలాల వివరాలను తెలియజేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని కొనియాడారు. అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలను పారదర్శకంగా లబ్ధిదారులకు అందిస్తున్నట్లు వెల్లడించారు. అర్హత ఉన్నా పథకాలు అందని వారిని గుర్తించి సంక్షేమ ఫలాలను దరిచేర్చేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజాసేవే పరమావధిగా నిరంతరం పరితపించే జగనన్నను మరోపర్యాయం ముఖ్యమంత్రిని చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఎం జగన్ ఆశయ సాధనకు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సేవలకు అనుగుణంగా జనం కోసం పనిచేసేందుకే ఎల్లప్పుడూ ప్రాధాన్యమిస్తానని చెప్పారు. 2024 ఎన్నికల్లో చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆశీర్వదించాలని మోహిత్‌రెడ్డి కోరారు.

రూ.3.15 కోట్లతో అభివృద్ధి

లింగనపల్లి, కె.వడ్డేపల్లి పంచాయతీలకు సంబంధించి రూ.3.15 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. అందులో భాగంగా జగనన్న సమావేశం మందిరం, యోగా ధ్యాన మందిరం, ఆర్వో ప్లాంట్, కర్మక్రియల కేంద్రం, కమ్యూనిటీ హాలు, శ్మశానవాటికలో సౌకర్యాల కల్పన, గ్రామ వేదికలు, రైతు భరోసాకేంద్రం, వెల్‌నెస్ సెంటర్, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ, పాల శీతలీకరణ కేంద్రం, పనులు నిర్మాణ దశలో కొనసాగుతున్నాయని వివరించారు. అచ్చమ్మఅగ్రహారంలో రూ.62లక్షలు వెచ్చించి ఎంపీపీ స్కూల్‌ను అభివృద్ధి చేశామని వెల్లడించారు. అనంతరం లింగనపల్లెలో పట్టు పురుగుల పెంపకాన్ని పరిశీలించారు. వైఎస్సార్ పశు బీమా పథకం అమలులో భాగంగా జీవాలకు పోషక మందులను అందించారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 71,831 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 31,831 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.11 కోట్లు మంది భక్తులు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం అవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,720
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,453
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,300
రిటైల్ వెండి గ్రాము	రూ.74.30

నేడు సెట్విన్‌లో ఉద్యోగ మేళా

తిరుపతి కల్చరల్: యువజన సర్వీసుల శాఖ, సెట్విన్, మోడల్ కెరీర్ సెంటర్, యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు సెట్విన్ సీఈఓ డాక్టర్ మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ సంస్థలో ఆర్‌టీఏ పోస్టుకు, ఫార్మసీ-ఏఐడీఈ పోస్టుకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ అర్హతతో పాటు 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. ఫార్మసిస్ట్ పోస్టుకు డీబీఎం-ఫార్మసి చదివి 18-40 ఏళ్లలోపు ఉన్నవారు అర్హులని చెప్పారు. టెలీకాలర్ ఉద్యోగానికి డిగ్రీ చదివి 18-25 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. అలాగే సాయి సంగీత ఎలక్ట్రికల్స్‌లో ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్ ఉద్యోగానికి డిప్లొమా ఇన్ ఈఈఈ అర్హతతో పాటు 18 ఏళ్లు పైబడిన వారు అర్హులన్నారు. అలాగే ఎన్‌బీబీ మెడికేర్‌లో ర్యాక్ కీపర్, హెల్ప్ వర్కర్ ఉద్యోగానికి ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ చదివి 20 నుంచి 40 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. ఫార్మసిస్ట్ ఉద్యోగానికి డీబీఎం-ఫార్మసీ చదివి 20-50 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండాలని, అకౌంటెంట్ పోస్టుకు డిగ్రీ, ఎంబీఏ చదివి 20 నుంచి 40 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. పైఅర్హతలు కలిగిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో గురువారం ఉదయం 10 గంటలకు అలిపిరి రోడ్డులోని ఎస్వీ మెడికల్ కళాశాల వద్ద, తిరుపతి చిరునామాకు హాజరు కావాలని కోరారు. ఈ అవకాశాన్ని అర్హులైన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 9440573537 నంబరులో సంప్రదించాలని కోరారు.

లారీ ఢీకొని యువకుడి మృతి


చిరంజీవి మృతదేహం


భార్యబిడ్డలతో చిరంజీవి (ఫైల్)

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సమీపంలోని దామినీడు వద్ద బుధవారం జాతీయ రహదారిపై లారీ ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. నగరి మండలం కనికాపురం గ్రామానికి చెందిన చిరంజీవి (24) బైక్‌పై తిరుపతికి వెళుతుండగా లారీ వెనకనుంచి ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కాలేజీకి తరలించారు. మృతుడికి భార్య, చిన్నబిడ్డ ఉన్నారు. ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీసిటీలో ఘనంగా యోగా దినోత్సవం


యోగా చేస్తున్న పరిశ్రమల ప్రతినిధులు



యోగా గురువుకు జ్ఞాపిక అందజేస్తున్న శ్రీసిటీ జీఎం సన్యాసిరావు

వరదయ్యపాళెం: శ్రీసిటీలో బుధవారం 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీసిటీ జనరల్ మేనేజర్ సన్యాసిరావు ఆధ్వర్యంలో ఉదయం స్థానిక విజిటర్స్ సెంటర్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 260 మంది పాల్గొన్నారు. సన్యాసిరావు మాట్లాడుతూ వసుదైక కుటుంబం థీమ్‌గా ఎంపిక చేయడం ఈ ఏడాది యోగా దినోత్సవ ప్రత్యేకతగా తెలిపారు. ఏలూరులోని యోగా కాన్షియస్‌నెస్ ట్రస్టుకు చెందిన యోగా గురువు సత్యారావు ఆధ్వర్యంలో వివిధ శ్వాస వ్యాయామాలపై శిక్షణ ఇచ్చారు. యోగా వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో భారతావని మానవాళికి అందించిన అపూర్వ బహుమతి యోగా అని పేర్కొన్నారు. యోగా సాధన ద్వారా శారీరక, మానసిక దృఢత్వాన్ని పొందవచ్చన్నారు. స్థానిక క్రిక్ సైడ్ అపార్ట్‌మెంట్‌లో ప్రతిరోజూ యోగా తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీసిటీ సెజ్ అథరైజ్డ్ అధికారి రామారావు, డీఎస్పీ జగదీష్ నాయక్, సెజ్ స్పెసిఫైడ్ ఆఫీసర్ మధుబాబు, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ కమిషనర్ సత్యనారాయణ, సెక్యూరిటీ, విజిలెన్స్ హెడ్ రమేష్ పాల్గొన్నారు.



పాపవినాశనం డ్యామ్‌లో వ్యక్తి మృతి


లక్ష్మప్ప (ఫైల్)

తిరుమల : తిరుమల పాపవినాశనం డ్యామ్‌లోని గ్యాలరీలో ఓ వ్యక్తి మృతి చెందిన విషయం బుధవారం సాయంత్రం వెలుగుచూసింది. తిరుమల టూటౌన్ ఎస్‌ఐ సాయినాథ్ చౌదరి కథనం మేరకు.. కర్ణాటకలోని హావేరి జిల్లా, కమలాపురం గ్రామానికి చెందిన కేఎల్ లక్ష్మప్ప (59) మే 26వ తేదీన తమ కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వచ్చాడు. శ్రీవారిని దర్శించుకుని కుటుంబసభ్యులతో కలిసి బయటకు వచ్చిన లక్ష్మప్ప కనిపించకుండా పోయాడు. ఎంత గాలించినా ఆచూకీ దొరకకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేసి సీసీ కెమెరాల ద్వారా లక్ష్మప్ప ఆచూకీని గుర్తించి గాలింపు చేపట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం పాపవినాశనం డ్యామ్‌లో ఓ మృతదేహం తేలుతున్న సమాచారం అందడంతో ఘటనాస్థలానికి చేరుకున్నారు. అది లక్ష్మప్ప మృతదేహంగా గుర్తించారు. మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని తిరుమల అశ్విని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు డ్రైవర్‌పై కేసు

ఏర్పేడు: నిర్లక్ష్యంగా బస్సును నడుపుతూ మోటార్ సైక్లిస్టును ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి బుధవారం రాత్రి తెలిపారు. ఈ నెల 18న సూళ్లూరుపేట డిపోకు చెందిన బస్సు డ్రైవర్ లోకనాథం రేణిగుంట వైపు వేగంగా వెళుతూ ఏర్పేడులోని వెంకటగిరి రోడ్డు కూడలిలో వెనుక నుంచి బైక్‌ను ఢీకొనగా చంద్రయ్య, లక్ష్మీదేవికి గాయపడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

నవోదయ ఫలితాల్లో విశ్వం విద్యార్థుల ప్రభంజనం


కె.హర్షిత్ టి.పి.రాజ్‌ప్రియన్ జె.శశాంక్ బి.చందుప్రజ్వల్ జి.కార్తిక పి.జ్ఞానేంద్రరెడ్డి

- విద్యాలయాలకు 42 మంది విద్యార్థుల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్:జాతీయ స్థాయిలో 2023-2024 విద్యా సంవత్సరానికి జరిగిన జవహర్ నవోదయ విద్యాలయ పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి, ఈ ఫలితాల్లో కే.హర్షిత్, వి.చందు ప్రజ్వల్, జీ.కార్తీక, బి.హేమంత్ కుమార్, పీ.జ్ఞానసేంద్ర రెడ్డి, ఎం.తీర్థ, టి.పీ.రాజ్ ప్రియన్, జే.శశాంక్, ప్రణీత్‌తో పాటు మొత్తం 42 మంది తమ విద్యార్థులు సీట్లు సాధించారని ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 33 ఏళ్లుగా జాతీయ స్థాయిలో జరిగే సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ వంటి పోటీ పరీక్షలకు తమ సంస్థలో శిక్షణ తీసుకున్న విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలతో పాటు అత్యుత్తమ మార్కులు, ర్యాంకులను సాధిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆ విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ ఎస్.విశ్వచందన్ రెడ్డి, కరస్పాండెంట్ ఎస్.తులసి అభినందించారు.

యువగళం పాదయాత్ర హాస్యాస్పదం


మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

వెంకటగిరి : నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు ప్రజల్లో స్పందన లేకపోవడంతో హాస్యాస్పదంగా మారిందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ విమర్శించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎందుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు వల్లే మానసికక్షోభతో ఎన్టీఆర్ మరణించారని ఆరోపించారు. టీడీపీ హయాంలో చంద్రబాబు నాయుడు తిరుపతి, వెంకటగిరి ప్రాంతాలను అభివృద్ధి చేయకపోగా, లక్షలాది మందికి ఉపాధి కల్పించే దుగరాజపట్నం ఓడరేవును అడ్డుకున్నారని మండిపడ్డారు. అప్పట్లో తిరుపతికి అంతర్జాతీయ క్రికెట్ మైదానాన్ని మంజూరు చేయించి శిలాఫలకం వేశామని, చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని ఆపేశారని స్పష్టం చేశారు. రాపూరు నుంచి ఏర్పేడు వరకు లక్షల ఎకరాల ప్రభుత్వ భూములు, మౌలిక వసతులు ఉన్న తిరుపతి, వెంకటగిరి ప్రాంతంలో రాజధాని తీసుకురాకుండా స్వలాభం కోసం అమరావతిలో కేపిటర్ ఏర్పాటు చేయడం ఏంటని ప్రశ్నించారు.

గంజాయి కేసులో ఇద్దరికి రిమాండ్

తిరుపతి లీగల్ : గంజాయి కేసులో ఇద్దరు నిందితులకు జూలై 5వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 21వ తేదీ తిరుపతి చెన్నారెడ్డి కాలనీ శ్మశానం వద్ద చెన్నారెడ్డి కాలనీకి చెందిన తంబూరు శ్యాంప్రసాద్, కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన కోనేటి జగదీష్ గంజాయితో ఉండగా అలిపిరి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు..

వివాహిత ఆత్మహత్య కేసులో ఆమె భర్త ఎస్. సురేష్‌బాబుకు జూలై 4వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు బుధవారం ఆదేశాలు జారీచేశారు. ఈనెల 19వ తేదీ తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సురేష్‌బాబు భార్య ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీనిపై ఆమె బంధువుల ఫిర్యాదుమేరకు పోలీసులతో సురేష్‌బాబుపై కేసునమోదుచేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

గంగజాతరకు వస్తుండగా..

సోమల: మండలంలోని సూరయ్యగారిపల్లె సమపంలోని కురబలచెరువు వద్ద బుధవారం మధ్యాహ్నం కారును పాల ట్యాంకర్ ఢీకొన్న ప్రమాదంలో భాకరాపేటకు చెందిన నలుగురు, ట్యాంకర్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు తిరుపతి జిల్లా భాకరపేటకు చెందిన ఐదుగురు మండలంలోని సూరయ్యగారిపల్లెలో జరుగనున్న గంగజాతరకు బంధువుల ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో దారితెలియక గ్రామ సమీపంలోని కురబలచెరువు వద్ద కారు ఆపి బంధువులకు ఫోన్ చేస్తున్నారు. ఈసమయంలో సోమల నుంచి సదుం వైపునకు వస్తున్న హెరిటేజ్ పాల ట్యాంకర్ అతి వేగంగా కారును ఢీ కొంది. ఈ ఘటనలో కారు, ట్యాంకర్ సూమారు 20 అడుగుల లోతులో ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడ్డాయి. కారులో ఉన్న విజయ్, మహేష్, సురేష్, ఖాజాఫీర్‌తో పాటు ట్యాంకర్ డ్రైవర్ కామరాజు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి, ఆపై మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పు చెల్లించలేదని తల్లీకుమార్తె నిర్బంధం

- ఎస్పీ ఆదేశాలతో పోలీసులు చర్యలు
- 8 మంది నిందితులు అదుపులోకి
- బాధితుల విడుదల

నగరి : ఇచ్చిన అప్పు తీర్చకపోవడంతో కుటుంబంతో సహా నిర్బంధించిన కేసులో పోలీసులు 8మందిని అదుపులోనికి తీసుకున్నారు. మండలంలోని నత్తంకండ్రిగలో బుధవారం రాత్రి బాధితులను విడిపించారు. సీఐ శ్రీనివాసంతి కథనం మేరకు తిరుపతికి చెందిన ఆనంద్ సతీష్ కుమార్‌కు నెత్తం కండ్రిగకు చెందిన హరిరెడ్డి రూ.6 లక్షలు అప్పిచ్చాడు. ఆ అప్పును అతను తిరిగి ఇవ్వక కాలయాపన చేయడంతో వడ్డీతో చేరి రూ.16 లక్షలు అయిందని, ఈ విషయమై చర్చించాలని, వెంటనే పుత్తూరు శివారులోని ఒక హోటల్ వద్దకు రమ్మని పిలిచాడు. ఈ నెల 5వ తేదీన ఆనంద్ సతీష్‌కుమార్ తన భార్య, కుమార్తెలను వెంటబెట్టుకుని అక్కడికి వచ్చాడు. అక్కడి నుంచి ఆనంద్ సతీష్‌కుమార్ కుటుంబసభ్యులను తన అనుచరుల సాయంతో బెదిరించి నెత్తం కండ్రిగలోని తన నివాసానికి తీసుకెళ్లి బంధించాడు. సాయంత్రం వరకు అక్కడే నిర్బంధించి ఎక్కడైనా డబ్బులు సేకరించి తనకు అప్పు చెల్లించి ఆనంద్ సతీష్‌కుమార్‌ను తీసుకెళ్లండని భార్య, కుమార్తెను వదలిపెట్టాడు. పోలీసులకు చెబితే జరిగేది వేరని బెదిరించాడు. జూన్ 15వ తేదీ వరకు డబ్బుల కోసం ప్రయత్నించి విఫలమవడంతో మళ్లీ నెత్తం కండ్రిగకు వారు వచ్చి తమను బంధించి ఆనంద్‌సతీష్‌కుమార్‌ను విడిచిపెడితే, ఆయన డబ్బులు సమీకరించుకుని వస్తాడని తెలిపారు.దీంతో అతన్ని వదలిపెట్టి వీరిద్దరినీ హరిరెడ్డి బంధించారు. బయటకు వెళ్లిన ఆనంద్‌సతీష్‌కుమార్ ఎంత ప్రయత్నించినా డబ్బులు అందకపోవడంతో బుధవారం ఎస్పీ కార్యాలయానికి వెళ్లి జరిగిన విషయం చెప్పి ఫిర్యాదు చేశాడు. ఎస్పీ ఆదేశాల మేరకు నెత్తం కండ్రిగలో తిరుత్తణి రోడ్డును ఆనుకుని టీదుకాణం వద్ద ఉన్న ఇంటిని తనిఖీ చేయగా ఆనంద్‌సతీష్‌కుమార్ భార్య, కుమార్తె బందీగా ఉన్నారు. వారిని విడిపించారు. ఈ ఉదంతానికి పాల్పడిన హరిరెడ్డి, రాజ, కళింమిట్టకు చెందిన చిన్న, ఏకాంబరకుప్పంకు చెందిన ఢిల్లీబాబు, మనోహర్, నరేంద్ర, విజయకుమార్, అనితను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న టెంపో

- 22 మందికి గాయాలు
- స్తంభించిన ట్రాఫిక్


ఈచర్ వాహనంలో ఇరుక్కుపోయిన డ్రైవర్ తాహీర్‌ను వెలికి తీస్తున్న స్థానికులు

చౌడేపల్లి: చౌడేపల్లె- సోమల మార్గంలోని సింగిరిగుంట సమీపంలో బుధవారం ఆర్టీసీ బస్సును ఈచర్ వాహనం ఢీకొన్న సంఘటనలో 22మంది గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు .. పుంగనూరు నుంచి ఆర్టీసీ బస్సు తిరుపతికి ప్రయాణీకులతో వెళ్తోంది. ఇదే క్రమంలో సదుం నుంచి టమాటా లోడ్‌తో ఐచర్ వాహనం వస్తోంది. సింగిరి గుంట సమీపంలో బస్సును ఈచర్ వాహనం అతివేగంగా ఢీకొంది. ఈ సంఘటనలో ఈచర్ వాహనం క్యాబిన్‌లోకి బస్సు దూసుకెళ్లింది. బస్సు డ్రైవర్ రెడ్డెప్ప(49), ప్రయాణికులు ఎస్. రమేష్‌బాబు(44), చిరంజీవి(30), కోకిల(25), చంద్రశేఖర్(50), జ్యోత్స్న(37),మరో 16 మంది గాయ పడ్డారు. టెంపో డ్రైవర్ తాహీర్ (27) ఈచర్ వాహనం క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. స్థానికులు, తోటి ప్రయాణికులు వెలికి తీశారు. క్షతగాత్రులను 108 సహాయంతో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాదంతో కిలోమీటర్ దూరం ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందిన వెంటనే ఎస్‌ఐ రవికుమార్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.